క్లుప్తంగా

నీలంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని వెంకటపతి కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ నీలంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి పీఠంలో 25వ తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారు రజిత కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నందు 108 మంది ముత్తైదువులు 108 రకాల పూలతో అమ్మవారికి పూల అభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాన్ని శక్తి పీఠాధీశ్వరి మాతాజీ శ్యామలమ్మ పర్య వేక్షించారు.

నేడు లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ వార్షికోత్సవం




సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా సెంటర్లోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయం ఏడవ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించనున్నారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పలువురు భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి అనుగ్రహం పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు ఆదివారం కోరారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో స్వయంభుగా వెలసిన గంగమ్మతల్లి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఈదా సాంబిరెడ్డి తొలిసారిగా అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ పూల పెదహనుమయ్య ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుశ్శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట ఆలయ వైస్ చైర్మన్ గంగిరెడ్డి లలిత, హనిమిరెడ్డి దంపతులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూల వెంకటేశ్వర్లు, ఆలయ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు



సత్తెనపల్లి: తూనికలు, కొలతలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ పి.షాలెంరాజు హెచ్చరించారు. ఆదివారం ఫిరంగిపురం, వేములూరిపాడు, పేరేచర్ల తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా చికెన్, మాంసం, చేపలు, కూరగాయలు, పండ్లు, ఎలక్ట్రికల్ దుకాణాలు, స్వీట్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా కాటాలు నిర్వహిస్తున్న 20 దుకాణదారుల పై కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ జాన్ సైదా, సిబ్బంది ఉన్నారు.

మాదల అడ్డరోడ్డు వద్ద చలివేంద్రం ప్రారంభం



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామ అడ్డరోడ్డు వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డేటిప్రసాద్ జ్ఞాపకార్థం మంచినీటి చలివేంద్రాన్ని గ్రామ ఉపసర్పంచ్ సైదా ఆదివారం ప్రారంభించారు. గత ఎనిమిదేళ్ళుగా ప్రసాద్ కుటుంబ సభ్యులు అడ్డరోడ్డు వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణీకుల దాహార్తిని తీరుస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోగులఅంజిబాబు, మాజీ సర్పంచ్ రావిపాటి బసవయ్య, ముప్పాళ్ళ సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డిసాయిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు యనమాలసింగయ్య, రహంతుల్లా, బ్రహ్మారెడ్డి, సైదా, బొడ్డేటిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందితే..ఆశీర్వదిస్తారు

- మంత్రి అంబటి రాంబాబు
- 98 శాతం ఎన్నికల హామీలు అమలు చేశాం
- 87 శాతం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాం



వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సమీక్ష చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: నాలుగు సంవత్సరాల పరిపాలన తర్వాత, ఎన్నికలకు ఏడాదికాలం ఉండగా ప్రజాప్రతినిధులను ప్రతి ఇంటికి పంపించి ప్రభుత్వ సేవలపై ఆరా తీయించి, వారి అభిప్రాయాలు తెలుసుకునే కార్యక్రమం దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ చేయలేదని... ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే జరుగుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలో జరుగుతున్న 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమ సమీక్షలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 2.84 లక్షల కోట్ల నగదును ప్రజలకు నేరుగా వారి ఖాతాలోకే పారదర్శకంగా బటన్ నొక్కి జమ చేశామని, 98 శాతం హామీలు అమలు చేశామని, కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన 87 శాతం మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. 50 శాతం పైగా ప్రజలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారని గడప గడపకు వెళ్లినప్పుడు తాను గమనిస్తున్నానని, ప్రజలు సంతృప్తి చెందితే మనల్ని ఆశీర్వదిస్తారని ఆయన వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ – అనే నినాదంతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇది ఎంతో ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, దీనిని చిత్తశుద్ధితో నూరు శాతం విజయ వంతం చేయాల్సిన బాధ్యత అందరి పై ఉందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సమష్టిగా, చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. వార్డులల్లో 'జగనన్నే మా భవిష్యత్ .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం పూర్తి చేసిన కౌన్సిలర్లను, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకుల బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, నాయకులు బాసు లింగారెడ్డి, షేక్ మౌలాలి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, అవ్వారు శ్రీనివాసరావు, బండి మల్లిఖార్జునరెడ్డి, కూకుట్ల శ్రీను, పట్టణ ఎస్వీఎస్ ఇన్‌చార్జ్ కొణతం స్వాతి,కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు ,గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి: జగనన్న నాలుగేళ్ళ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రజల సమస్యల పరిష్కరించడానికే గడప గడపకు వస్తున్నామని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని లింగాపురం సచివాలయ పరిధిలో ఎస్సీ కాలనీ, ముస్లిం కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే తన వెంట ఉన్న అధికారులను అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ప్రభుత్వ పథకాలను కేటాయించడంలో ఎటువంటి వివక్ష చూపకుండా రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది అర్హులైన వారందరికి మంజూరు చేయాలన్నారు. ప్రజల సమస్యలు వింటూ వాటికి అధికారులతో చర్చించి వెంటనే పరిష్కారాలను సూచిస్తూ ముందుకు సాగారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ అన్ని వర్గాలవారికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తూ జనరంజకంగా పరిపాలిస్తున్న సీఎం జగన్‌మోహన రెడ్డి ప్రభుత్వంపై ఏదోవిధంగా బురదచల్లటం టీడీపీకి, ఎల్లోమీడియాకు అలవాటుగా మారిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో పార్టీలకు అతీతంగా లింగాపురంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించామన్నారు. తొలిరోజు లింగాపురంలో 350 గడపలను సందర్శించి వారికి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు.

లింగాపురంలో 16.30 కోట్లతో సంక్షేమాభివృద్ధి...

లింగాపురం సచివాలయ పరిధిలో ఇప్పటివరకు ప్రభుత్వం 16.30 కోట్లరూపాయల సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అందులో 13.41కోట్ల రూపాయల సంక్షేమం, 2.89 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఏడుకొండలు, అమరయ్య, శ్రీను, పుట్టి కోటయ్య, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ హరిబాబు, జెడ్పీటీసీ కరుణకుమారి, జెడ్పీ కోఆప్షన్ మెంబరు షేక్ హుష్మీ, మాజీఎంపీపీ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

'జగనన్నే మా భవిష్యత్ .. మా నమ్మకం



గోడకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అంటిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ పెండెం బాబురావు



మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు



క్రోసూరులో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నేతలు

సత్తెనపల్లి: 'అమ్మా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన నచ్చిందా ... సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ... మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కావాలని కోరు కుంటున్నారా అని ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రశ్నించడంతో అయ్ .. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావాలండి' అని లబ్ధిదారులు సంతృప్తికరమైన సమాధానం వెల్లడించారు. సత్తెనపల్లి నియోజక వర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోని గ్రామాలలో 'జగనన్నే మా భవిష్యత్ .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంటింటికీ వెళ్లిన ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజాభిప్రాయం సేకరించారు. ఈ సందర్భంగా గత టీడీపీ ప్రభుత్వానికి ... ప్రస్తుత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను అడిగి సమాధానాలు స్వీకరించారు. భవిష్యత్తులో ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారని అడిగారు. లబ్ధిదారుల అనుమతితో వారి ఇంటి తలుపులకు, గోడలకు 'మా నమ్మకం నువ్వే జగన్' డోర్ స్టిక్కర్లు అతికించారు.వారి సెల్ ఫోన్ నుంచి :82960 82960 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకుని సాధ్యమైన వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరులో..

క్రోసూరు: క్రోసూరు ఎస్సీకాలనీలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం సచివాలయ కన్వీనర్లు దుగ్గి ఏడుకొండలు, దాసన్య , గృహసారథులు చిల్కా ప్రకాశం, చిల్కా మనోహర్, చిల్కా గంగయ్య, వలంటీర్ చిల్కాజ్యోతి, పందిటి వీరయ్య, రవి తదితరులు కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ ఫలాలు వివరించారు. మా నమ్మకం నువ్వే జగనన్న స్టికర్లు అంటించారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు సంపూర్ణమద్దతు ఇవ్వాలని కోరారు.

ఇంటింటా జగనన్న నువ్వే మా నమ్మకం

నకరికల్లు: ఇంటింటా జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కర్‌లతో కళకళలాడుతున్నాయని జేసీఎస్ మండల ఇన్‌చార్జి మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు, జగనన్న నువ్వే మా నమ్మకం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను వైఎస్సార్ సీపీ పరిపాలనపై అనుకూల స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టినమూనా పరీక్షలపై రైతులకు అవగాహన



మట్టినమూనా పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సుగుణాబేగం

అచ్చంపేట: మట్టినమూనా పరీక్షలపై రైతుభరోసా కేంద్ర సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాల్సిన అవశ్యత ఉందని ఏఓ షేక్ సుగుణాబేగం అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఆదివారం ఆమె అగ్రికల్చరల్ అసిస్టెంట్స్‌కు, రైతు భరోసా కేంద్ర సిబ్బందికి శిక్షణ నిచ్చారు. నేల ఆరోగ్యం, భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనా సేకరణ ఎలా చేయాలో వివరించారు. మట్టి నమూనాలను వివిధ భౌతిక, రసాయనిక పరీక్షల ద్వారా లభ్యమమె పోషకాల పరిమాణాన్ని లెక్క కట్టి అధిక దిగుబడులు సాధించుటకు వాడాల్సిన ఎరువులను పంటలను బట్టి సిఫార్సు చేసేందుకే మట్టినమూనా సేకరణ ముఖ్య ఉద్దేశ్యంగా చెప్పారు. సాధారణంగా వ్యవసాయ పంటలకు ఆరు అంగుళాల లోతు నుంచి మట్టి నమూనాలు సేకరించడం జరుగుతుందన్నారు. అలాగే భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వినియోగించుకుంటే అధిక దిగుబడులు సాధ్యపడతాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్స్, వ్యవసాయ సిబ్బంది, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మృత్తిక శివలింగానికి మహా భస్మాభిషేకం



పవిత్ర నదీజలాలతో మృత్తిక శివలింగానికి అభిషేకాలు చేస్తున్న స్వామిజీలు



పూజలకు హజరైన భక్త జన సందోహం

సత్తెనపల్లి: లోకకళ్యాణార్థం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మృతిక(మట్టి) శివలింగానికి మహా రుద్రాభిషేకం, మహా భస్మాభిషేకం ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో ఏర్పాటు చేసిన వేదిక పై సాంప్రదాయబద్ధంగా వేదమంత్రోశ్చరణల మధ్య మహా రుద్రాభిషేకం, మహ భస్మాభిషేకం నిర్వహించారు. సర్వ ప్రాణ కోటి ఆనందంగా జీవించాలని, సమస్త మానవ కోటి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, భక్తి, జ్ఞాన వైరాగ్యములు కలిగి ఆనందంగా జీవించాలనే సంకల్పంతో లోకకళ్యాణార్థం రుద్రునికి ప్రీతికరమైన పవిత్ర పుణ్య నది జలాలతో, విశేష ద్రవ్యములతో, విశేష పుష్పములతో, విశేష మధుర ఫల రసాలతో కలియుగంలో విశేష ఫలితాన్ని ఇచ్చే మృత్తిక శివలింగ రూపంలో కొలువుదీరిన రుద్రునికి శంఖు ఢమరుకం, గంట మొదలగు విశేష వాయిద్యాలతో మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. మహా రుద్రాభిషేకం, మహా భస్మాభిషేకంకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహా శివుని అనుగ్రహం పొందారు. పట్టణమంతా ఓం నమఃశివాయ నామస్మరణతో మారుమ్రోగింది. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

1998 డీఎస్సీ క్వాలిఫైడ్స్ జీవితాలల్లో వెలుగులు నింపిన సీఎం జగన్



షేక్ మస్తాన్‌వలి

సత్తెనపల్లి: ఒక్క కలం పోటుతో దాదాపు నాలుగు వేలకు పైగా ఉన్న 1998క్వాలిఫైడ్ అభ్యర్థుల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని ఇటీవల ఉద్యోగం పొందిన పట్టణంలోని నాగార్జునగర్‌కు చెందిన షేక్ మస్తాన్ వలి అన్నారు. ఇటీవల ఉద్యోగాలు పొందిన సత్తెనపల్లి పట్టణానికి చెందిన దాదాపు పన్నెండు మంది క్వాలిఫైడ్స్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి జీవితాంతం ఋణపడి ఉంటాము అని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తెలిపారు. తమకు ఈ ఉద్యోగాలు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, కల్పలతా రెడ్డి, ఉద్యమ నాయకులు విశ్వం, బాలి రెడ్డి, బైరెడ్డి, భైరవకోన తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. తాము, తమ కుటుంబాలు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి,విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణలకు జీవితాంతం ఋణపడి ఉంటామన్నారు. ఆర్డర్ ఆఫ్ మెరిట్ లో ఉద్యోగాలు పొందలేకపోయిన మిగిలిన క్వాలిఫైడ్స్ అందరికి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఆయనతో పాటు ఇటీవల ఉద్యోగాలు పొందిన శ్రీనివాస్ రెడ్డి, రమణారెడ్డి, జగదీష్, కొండయ్య, పూర్ణమ్మ, విజయ్ రాజ్, షంషేర్ అలీ తదితరులు ఉన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ పట్టణ విస్తృతస్థాయి సమావేశం

సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం సాయంత్రం 4.00 గంటలకు వైఎస్సార్ సీపీ పట్టణ విస్తృతసాయి సమావేశం జరుగు తుందని మున్సిపల్ చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీ తులసి, వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్ ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరౌతారన్నారు. కౌన్సిలర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బెజగం రవికుమార్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మారక పురస్కారం



పురస్కారం అందుకుంటున్న బెజగం రవికుమార్

సత్తెనపల్లి: పుడమి సాహితి వేదిక నల్గొండ వారు మహనీయుల జయంతోత్సవాల సందర్భంగా నల్గొండ లోని యటకన్నా రెడ్డి కాలనీలోని న్యూస్ స్కూల్ లో డాక్టర్ చిలుముల బాల్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పురస్కార ప్రధానోత్సవ సభలో ఉపాధ్యాయులు, భరతనాట్య ప్రవీణులు, సాంఘీక సేవా రంగాలు, రైతు సేవా రంగాలు, కళా రంగాలలో నిష్ణాతులైన వారిని రెండు రాష్ట్రాల స్థాయిలో ఎంపిక చేసి ప్రధానం చేశారు.అంబేడ్కర్ స్మారక పురస్కారాలు 20 మందికి, బాబూ జగ్జీవనరామ్ పురస్కా రాలు 15 మందికి, మహత్మా జ్యోతిరావు పూలే పురస్కారాలు 11 మందికి ప్రధానం చేశారు. ఈ పురస్కార గ్రహీతలలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణమునకు చెందిన వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవి కుమార్ కి విభిన్న పౌరాణిక పాత్రలు పోషించి, రెండు రాష్ట్రాల ప్రేక్షకులను రంజింప చేసినందుకు గాను అంబేడ్కర్ స్మారక పురస్కారమును ప్రధానం చేశారు. దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా రవి కుమార్ ను సత్తెనపల్లిలోని వివిధ కళా సంస్థల అధినేతలు, కార్య దర్శులు, మిత్రులు, బంధువులు ఆదివారం ప్రశంసించారు.

అప్రమత్తతే అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట

- ఈ నెల 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు
- అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



పట్టణంలోని అపార్ట్‌మెంట్‌లో గ్యాస్ లీకేజీల పై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సత్తెనపల్లి: సేవే మా కర్తవ్యం అనే నినాదంతో విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేస్తోంది. సాధారణ రోజుల కన్నా వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. భారీగా ఆస్తి నష్టంతో పాటు ప్రాణనష్టం సంభవిస్తుంది. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రజలను అప్రమత్తం చేయడానికి ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు వారం రోజులు అగ్నిమాపక వారోత్స వాలు నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కరపత్రాల పంపిణీ, ర్యాలీలు, ప్రధాన కూడళ్లల్లో మాక్ డ్రిల్ నిర్వహణతో అన్ని వర్గాల వారిలో చైతన్యం తీసుకొస్తున్నారు. విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై వివిధ పోటీలు నిర్వహించి వారి ద్వారా పెద్దలకు అవగాహన కల్పిస్తున్నారు. 1944లో ముంబైలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో అశువులు బాసిన 66 మంది అగ్నిమాపక సిబ్బంది జ్ఞాపకార్థం ఏటా ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడడ కన్నా ముందే అప్రమత్తమైతే విపత్తును అరికట్టవచ్చనే ఉద్దేశంతో అగ్నిమాపక శాఖ ప్రజల్లో అవగాహన పెంచుతుంది. ఈ వారం రోజులపాటు అగ్ని ప్రమాదాలు – తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. అగ్ని ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఈ శాఖ కృషి చేస్తుంది. ప్రమాదాలు జరిగిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కంటే ప్రమాదమే సంభవించకుండా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు.



పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రధాన కారణాలు...


పలు గృహాల్లో ఇన్వర్టర్, సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నట్లు అగ్నిమాపక శాఖ గుర్తించింది. గ్రామీణ ప్రాంతాల్లో గడ్డివాములు నివాస గృహాలకు దగ్గరగా ఉండడం, సిగరెట్, బీడీలు తాగుతూ పూర్తిగా ఆర్పకుండా విసిరేయడంతో అవి గడ్డివాములు, చెత్తాచెదారం పై పడి అగ్ని ప్రమాదం సంభవిస్తోంది. ఓవర్ లోడ్, నాసిరకు సామాగ్రి వినియోగించిన దుకాణాలు, షాపింగ్ మాల్స్, బహుళ అంతస్తుల భవనాల్లో షార్ట్ సర్క్యూట్ జరుగుతుంది. వంటగదిలో గ్యాస్ లీకేజీతో, క్రమ గ్యాస్ ఫిల్లింగ్ కేంద్రాల వద్ద తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాక్టర్లలో ఎండు గడ్డి పరిమితికి మించి తీసుకెళుతున్న సమయంలో మార్గమధ్యంలో పై భాగంలోని విద్యుత్ తీగలు తగలడంతో మంటలు వ్యాప్తి చెందుతున్నాయి.

అగ్ని ప్రమాదాల నివారణపై చైతన్యం

అగ్ని ప్రమాదాలు నివారణ చర్యలపై ప్రజల్లో చైతన్యం, అవగాహన తీసుకువచ్చి అగ్ని ప్రమాదాలను పూర్తిగా నివారించాలని ప్రయత్నిస్తున్నాం. అగ్నిప్రమాదం జరిగితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనేదానిపై వివరిస్తున్నాం. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. ప్రమాదం జరిగిన వెంటనే 101 కు ఫోన్ చేసి సమాచారం అందించాలి.

– ఆలా శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి, సత్తెనపల్లి.

గుండెపోటుతో వృద్ధుడి మృతి



అంకమ్మరావు మృతదేహం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు నరసరావుపేట మండలం పెద రెడ్డిపాలెంకు చెందిన కుంభా అంకమ్మరావు(53) పరదాపట్టలు వ్యాపారం చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో తెల్లవారుజామున కుందురువారి పాలెంలోని తమ సమీప బంధువుల ఇంటివద్ద పరదా పట్టాలు వేసి ఇంటికి వెళ్తూ మార్గమధ్యలో తన ద్విచక్రవాహనాన్ని రోడ్డు పక్కన పెట్టి బహిర్భూమికి వెళ్లాడు. ఆ సమయంలో గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి పడి ఉన్నాడు. తెల్లారిన తర్వాత అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని మృతుని వద్ద నున్న సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్ళారు. జరిగిన ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ముప్పాళ్ళ పోలీసులు తెలిపారు.